క్లుప్తంగా

సర్వవాహనంపై స్వామి ఊరేగింపు

మామిడికుదురు: మాకనపాలెంలో కొలువుదీరిన అనంతలక్ష్మీ, భూదేవి సమేత సత్యనారాయణస్వామి వారి 71వ దివ్య తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం సర్వవాహనంపై స్వామి వారు విహరించారు. భక్తుల ఆనందోత్సాహాల నడుమ స్వామి వారి గ్రామోత్సవం ఆద్యంతం కనుల పండువగా జరిగింది. ఉదయం భక్తులు స్వామి వారి వ్రతాలు ఆచరించారు. అనంతరం మొక్కులు చెల్లించుకుని, అభిషేకాలు చేయించుకున్నారు. తిరు కల్యాణోత్సవాల సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు, స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులతో స్వామి వారి ఆలయం కోలాహలంగా మారింది.

నిత్యాన్నదానానికి రూ.10 వేల విరాళం



దాత కుటుంబానికి స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ట్రస్టు బోర్డు సభ్యులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు సోమవారం విశాఖపట్నానికి చెందిన దొడ్డి గణపతిరావు, గంగారత్నం దంపతులు రూ.10,001 విరాళంగా ఇచ్చారు. ఏటా జూన్ 10న తమ పెళ్లి రోజు సందర్భంగా భక్తులకు అన్నదానం చేయాలని కోరుతూ ఈ విరాళం అందించారు. దాత కుటుంబానికి దేవస్థానం ఈవో ఎంకేటీ నాగవరప్రసాద్, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ధర్మకర్తల మండలి సభ్యులు బత్తుల విజయగంగారత్నం, గూటం శ్రీను, చిట్టాల సత్తిబాబు స్వామి వారి చిత్రపటంతో పాటు ప్రసాదాలను అందించారు.

గోదావరి మాతకు పున్నమి హారతి

ఆలమూరు: మండలంలోని జొన్నాడలోని అఖండ గౌతమీ గోదావరి తీరంలో ఆదివారం సాయంకాలం గోదావరి మాతకు అఖండ పున్నమి హారతి జరిగింది. శ్రీశుభకృత్ నామ సంవత్సర పాల్గుణ మాస శుద్ధ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రముఖ వేద పండితుడు ద్విభాష్యం రవికృష్ణ శర్మ పర్యవేక్షణలో గ్రామానికి చెందిన మహిళ భక్త బంద సభ్యులు శాస్త్రోక్తంగా ఈ పున్నమి హారతిని చేపట్టారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య మహిళలు స్థానిక శ్రీ, భూ సమేత జనార్దనస్వామి ఆలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరి గౌతమీ తీరానికి చేరుకుని గోదావరి మాతకు అఖండ పున్నమి హారతిని ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రద్దు చేసిన పథకాలను పునరుద్ధరించాలి

మామిడికుదురు: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాంగ బద్ధంగా రావాల్సిన 28 పథకాలను తిరిగి పునరుద్ధరించాలని స్థానిక బీఆర్ అంబేడ్కర్ సామాజిక భవనంలో సోమవారం జరిగిన అఖిలపక్ష సమావేశం డిమాండ్ చేసింది. భూపతి వెంకటపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. రద్దు చేసిన పథకాలను తిరిగి కొనసాగించే వరకు పోరాటం చేస్తామని పలువురు వక్తలు పేర్కొన్నారు. సమావేశంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, పలు పార్టీలకు చెందిన నల్లి శ్రీనివాస్, నూటుకుర్తి సత్యనారాయణ, బడుగు సాయిబాబు, జాలెం శ్రీనివాసరాజు, జాలెం శ్రీనివాసరాజు, జాలెం సుబ్బారావు, మెండా బాబ్జీ, గెద్దం వెంకటేశ్వరరావు, బొంతు మణిరాజు, జాలెం సుబ్బారావు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా రాణించాలి

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు వైఎస్సార్ చేయూత పథకం ద్వారా లబ్ధి పొంది ఆర్థికంగా రాణించి ఇతరులకు ఆదర్శంగా ఉండాలని వైఎస్సార్ క్రాంతి పథం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ శామ్యూల్ అన్నారు. అంబాజీపేట వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం వద్ద వీవోఏలకు, సిబ్బందికి ఎస్సీ సబ్ ప్లాన్, వైఎస్సార్ చేయూత, ఎస్సీ, ఎస్టీ ఉన్నతి లోన్‌ల సద్వినియోగాలపై ఏపీఎం ఆర్ఎండీ గంగాధర్ అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. శ్యామ్యూల్ మాట్లాడుతూ అర్హులైన మహిళలకు వైఎస్సార్ చేయూత రూ.18,500లు ప్రభుత్వం అందిస్తుందన్నారు. మహిళలు షాపులు ఏర్పాటు చేసుకునేందుకు రూ.75 వేల బ్యాంకు రుణం ఇస్తున్నామన్నారు. లైవ్ స్టాక్ పథకం ద్వారా పశువుల పెంచుకొనేందుకు రుణాలు ఇస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీసీలు శ్రీనివాస్, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలకు అవగాహన పెంచాలి

రాజోలు: మహిళలకు రాజ్యాంగం ద్వారా రూపొందించిన చట్టాలపై అవగాహన కల్పించాలని జూనియర్ సివిల్ జడ్జి జి.సురేష్‌బాబు అన్నారు. సోమవారం స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఏపీపీ నల్లి ఆనంద్, న్యాయవాది గంటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీరు అందదు.. సాగు సాగదు..

- శివారు రైతులకు సాగునీటి ఇబ్బంది
- కలుషితమవుతున్న సాగు జలాలు
- కాలువల దుస్థితిపై రైతుల ఆవేదన



పినపళ్ల వద్ద గ్రామాభివృద్ధి నిధులతో కాలువల్లో చెత్త, వ్యర్థాల్ని తొలగిస్తున్న రైతు కూలీలు (ఫైల్)



పంట కాలువలో వ్యర్థాలతో సగం వరకూ మూసుకుపోయిన వెదురుమూడి కాలువ

ఆలమూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'స్వచ్ఛ' గ్రామాల అభ్యుదయానికి కృషి చేస్తుంటే కొన్నిచోట్ల కొంతమంది దీనికి విరుద్ధంగా పంట కాలువలను, గట్లను అపరిశుభ్రతకు గురి చేస్తున్నారు. దీనికి తోడు పంట కాలువల వెంబడి నివసిస్తున్న ప్రజానీకం ఇష్టానుసారం వ్యర్థాలను అందులో పడవేయడం రైతులకు ప్రాణసంకటంగా మారింది. దీనికి తోడు కాలువగట్లను ఆక్రమించి నివాసాలు ఏర్పరచుకోవడం, ఇంట్లో వ్యర్థ జలాలను పైప్‌ల ద్వారా కాలువల్లోకి వదలడం తదితర చర్యల వల్ల సాగునీటి జలాలు కలుషితమవుతున్నాయి. పంట కాలువలు మూసివేయడంతో అడుగడుగునా అందులో దాగి ఉన్న వ్యర్థాలు బయట పడుతున్నాయి. దీంతో ఆ నీటిను తాగుతున్న పశువులకు అనారోగ్య సమస్యలు ఎదురవడంతో పాటు పరోక్షంగా పంట చేలల్లో తెగుళ్లకు కారణమవుతుంది. ఇలాంటి చర్యల వల్ల పచ్చని పంట పొలాలకు సాగు నీరు అందించవలసిన పంట కాలువలు కొందరి నిర్లక్ష్యం వల్ల పెంట కాలువలుగా మారుతున్నాయి. పండుగలు, పర్వదినాలు, మాలధారణ సమయంలో పుణ్యస్నానాలు ఆశ్రయించే భక్తులు ఆ కాలువలను దుస్థితి చూసి ఆవేదన చెందుతున్నారు. అనేక గ్రామాల్లో గ్రామాభివృద్ధి కమిటీ ద్వారానే కాకుండా అవకాశాన్ని బట్టి ఎన్ఆర్‌జీఈఎస్ నిధుల ద్వారా కాలువలకు మరమ్మతులు చేసుకుంటున్నా సరైన ఫలితాలు మాత్రం కనిపించడం లేదు. ఖరీఫ్ సాగు తుది దశకు చేరుకోవడంతో వరి పంటకు ఆఖరి తడి పెట్టవలసిన పరిస్థితి ఏర్పడింది.

అన్ని పంట కాలువల్లోనూ అదే పరిస్థితి

కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గంలోని అన్ని మండలాలకు ధవళేశ్వరం బ్యారేజీ నుంచి తూర్పు, సెంట్రల్ డెల్టా కాలువల ద్వారా సాగు నీరు విడుదల అవుతుంది. ఆ నీరు ఉప కాలువ, పిల్ల కాలువల ద్వారా సుమారు 70 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. ఈ నీరు పారే క్రమంలో కాలువ వెంబడి ఉన్న గ్రామాలు, నివాసాల నుంచి చెత్త, చెదారం ఆ కాలువల్లోనే పడేస్తున్నారు. దీని వల్ల అందులో ఉండే వ్యర్థపు పదార్థాల వల్ల డ్యామ్‌లు, తూముల వద్ద ఆగిపోయి సాగునీటి ప్రవాహానికి తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. దీనివల్ల శివారు ప్రాంతాలకు సాగునీరు సక్రమంగా అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. అన్ని కాలువల్లోనూ అదే పరిస్థితి నెలకొనడం వల్ల రెండు పంటలకు అవసరమయ్యే సాగునీరు పుష్కలంగా ఉన్నా వ్యర్థాల వల్ల మోటారు బోర్లను ఆశ్రయించవలసిన పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

మురుగు కాలువలను వినియోగించుకునేందుకు చర్యలు

నియోజకవర్గంలోని పలు మండలాల్లో మురుగు కాలువలు అందుబాటులో ఉన్నా గ్రామీణ వాసులు వినియోగించుకోలేని పరిస్థితి ఇప్పటి వరకూ లేకుండా పోయింది. ఇటీవల గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. దీంతో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటుకు మార్గం సుగమమయింది. దీనికి తోడు గ్రామాలకు సుదూరంగా ఉన్న మురుగుకాలువలకు గ్రామాల్లోని మురుగు నీటిని అనుసంధానం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటే స్వచ్ఛ సంకల్ప గ్రామాల కోరిక నెరవేరే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

మెయింటెనెన్స్ నిధుల నుంచి శుభ్రపరుస్తాం

పంట కాలువలు తెరిచే లోపు ప్రభుత్వ సమకూర్చనున్న మెయింటెనెన్స్ నిధుల నుంచి ఆధునీకరిస్తాం. కాలువల్లో వ్యర్థాలు వేయకూడదన్న భావన ప్రతి ఒక్కరిలో కలగాలి. తద్వారా రైతులు మెరుగైన, నాణ్యమైన పంటలు పండించే వీలు కలుగుతుంది.

– టి.కృష్ణ త్రిమూర్తులు, ఇరిగేషన్ జేఈ, ఆలమూరు

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం



గంగలకుర్రులో క్రీడా దుస్తులతో విద్యార్థులు

అంబాజీపేట: క్రీడలు విద్యార్థుల మానసికోల్లాసానికి దోహదపడతాయని హెచ్ఎం వై.జె.నాగజ్యోతి అన్నారు. క్రీడాకారులకు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు నండూరి సుబ్బారావు సమకూర్చిన క్రీడా దుస్తులను గంగలకుర్రు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు సోమవారం అందజేశారు. సుబ్బారావు సతీమణి రాజేశ్వరి జ్ఞాపకార్థంగా రూ.30 వేల విలువ చేసే క్రీడాకారుల దుస్తులను అందించినట్లు హెచ్ఎం తెలిపారు. కార్యక్రమంలో పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి, మెండి సత్తిరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

మామిడికుదురు: ఇరాక్‌లోని కర్బలాకి వెళ్లి గుండెపోటుతో మృతి చెందిన నగరం గ్రామానికి చెందిన ఆర్ఎంపీ మీర్జా గులామ్ అబ్బాస్ అలియాస్ అబ్బాస్ కుటుంబ సభ్యులను సోమవారం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పరామర్శించారు. ఆర్ఎంపీగా గులామ్ అబ్బాస్ ఎంతో మంది పేదలకు వైద్య సేవలందించారని చిట్టిబాబు పేర్కొన్నారు. ఆయన మరణం తీరని లోటన్నారు. అబ్బాస్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి, సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు సజ్జాద్ హుస్సేన్, కో–ఆప్షన్ సభ్యుడు నూరైన అబ్బాస్, ఉప సర్పంచ్ అన్వర్ తాహిర్ హుస్సేన్, గ్రామశాఖ అధ్యక్షుడు కడలి శ్రీనివాస్, జాలెం కృష్ణారావు, కొండేటి వికాస్‌బాబు, అస్కర్ హుస్సేన్ ఉన్నారు.

అనారోగ్య సమస్యలపై అవగాహన ఉండాలి

అంబాజీపేట: ప్రస్తుత కాలంలో మహిళలకు వచ్చే పలు రకాల అనారోగ్య సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని అంబాజీపేట స్త్రీల ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎస్ఆర్‌కె హెవార్డ్ రాజు అన్నారు. స్థానిక స్త్రీల ఆస్పత్రి ఆవరణలో మహిళలకు అనారోగ్య సమస్యలపై అవగాహన సదస్సును ఆయన సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 45 ఏళ్లు దాటిన ప్రతి మహిళ ఆరు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయించుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ అవగాహన సదస్సులో పి.గన్నవరం గ్రేస్ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులు పాల్గొని మహిళలకు సంభవించే రోగాల వివరాలను చార్టుల సహాయంతో వివరించారు.

పర్ర ప్రాంతంలో నమూనాల సేకరణ



ఎస్.యానాం పర్ర ప్రాంతంలో నమూనాలను సేకరిస్తున్న సిబ్బంది

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానాంలో సముద్ర తీర పర్ర ప్రాంతంలో గత కొన్ని రోజులుగా చేపలు మృత్యువాత పడుతుండడంతో కాలుష్య నియంత్రణ, మత్స్యశాఖ సిబ్బంది దళ్లపర్రలోని మట్టి, నీటి నమూనాను సోమవారం సేకరించారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు నమూనాలు తీసుకుని ల్యాబ్‌కు పంపిస్తామని, వివరాలు 15 రోజుల్లో వెల్లడిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీవో పి.నాగవిష్ణు, కాలుష్య శాస్త్రీయ అధికారి పీవీఎస్ చలం, గ్రామ సహాయకులు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం ఆర్టీసీ బస్టాండ్‌లో అగ్నిప్రమాదం

అమలాపురం రూరల్: ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న బయో టాయిలెట్స్ సోమవారం సాయంత్రం ప్రమాదవశాత్తూ జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. డిపో గ్యారేజీ లోపల డీజిల్ బంకులు ప్రమాద స్థలానికి దూరంగా ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం తెలుసుకున్న వెంటనే అమలాపురం అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. దీంతో ప్రయాణికులందరూ ఊపిరి పీల్చుకున్నారు. బయో టాయిలెట్స్‌కు వాటర్ కనెక్షన్ ఏర్పాటు చేయకపోవడంతో రెండేళ్లుగా అవి నిరుపయోగంగా ఉన్నాయి.

స్పందనకు అర్జీల వెల్లువ



కొత్తపేటలో స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో ముక్కంటి

అంబాజీపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు రెండు అర్జీలు వచ్చినట్లు ఎంపీడీఓ ఐ.రత్నంరాజు, తహసీల్దార్ టి.మంగతాయారు తెలిపారు. తొండవరంలో ఉన్న కొబ్బరి తోటలో పాడుపడిన నుయ్యి ఉందని దానిని పూడ్చివేయాలని, అంబాజీపేటలో దారి ఏర్పాటు చేయాలని ఒకటి దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ స్పందనలో మండలంలోని అధికారులంతా పాల్గొన్నారు.

మట్టి వాహనాలతో వంతెనకు ప్రమాదం

మలికిపురం: మండలంలోని గుడిమెళ్లంక గ్రామ శివారు మూలపోడులో వంతెనపై మట్టి అక్రమ రవాణా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని, అసలే బలహీనంగా ఉన్న వంతెన వీటి వల్ల కూలిపోయే ప్రమాదం ఉందని స్పందనలో గ్రామానికి చెందిన గొల్ల శ్యాం ఆందోళన వ్యక్తం చేశారు. మేజర్ డ్రైన్‌పై ఉన్న ఈ శిథిల వంతెన కూలిపోతే తమ ప్రాంతాలకు మలికిపురంలో సంబంధాలు తెగిపోతాయని ఆయన పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి అక్రమ వాహనాల రాకపోకలను అరికట్టాలని ఆయన తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు.

కొత్తపేటలో..

కొత్తపేట: డివిజన్ కేంద్రం కొత్తపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ ఈ.మహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన స్పందనకు ఆర్డీవో ఎం.ముక్కంటి ప్రత్యేకంగా హాజరయ్యారు. ఈ స్పందనకు మూడు అర్జీలు వచ్చాయి. అర్జీలు సత్వర పరిష్కారంపై జిల్లా కేంద్రం అమలాపురంలో కలెక్టర్ స్పందన నుంచి డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సబ్ ట్రెజరీ, సబ్ రిజిస్ట్రార్, ఫైర్, కో ఆపరేటివ్ సహా అన్ని ప్రభుత్వ శాఖల సబ్ డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ప్రతి సోమవారం స్పందనకు అధికారులు అందరూ హాజరుకావాలని ఆర్డీవో ముక్కంటి ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ జీడీ కిషోర్‌బాబు, ఎంఈఓ ఎం.హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే దరఖాస్తు

ఆలమూరు: స్పందనలో భాగంగా మండలానికి సంబంధించి ఒకే దరఖాస్తు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నమోదైంది. మండలానికి సంబంధించి 30 శాఖలకు చెందిన అధికారులు హాజరు కావలసి ఉండగా 26 మంది మాత్రమే హాజరయ్యారు.

అంబేడ్కర్ ఆశయాల స్ఫూర్తితో ముందడుగు వేయాలి

రాజోలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల స్ఫూర్తితో యువత ముందడుగు వేయాలని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. కాట్రేనిపాడులోని పాటిభూమి ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే రాపాక ఆవిష్కరించారు. విగ్రహాన్ని ఏర్పాటు చేసిన శెట్టిబత్తుల రవి కుమార్‌ను పలువురు అభినందించారు. రిపబ్లికన్ పార్టీ జాతీయ అధ్యక్షుడు డీబీ లోక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ మట్టా శైలజ, సీపీఐ నాయకుడు దేవ రాజేంద్రప్రసాద్, కొంకి రాజామణి, తెన్నేటి కిషోర్, గెడ్డం తులసీభాస్కర్ తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పార్టీ శ్రేణులను చైతన్యపరచండి



మిథున్‌రెడ్డిని సత్కరిస్తున్న గ్రీవెన్స్ సెల్ చైర్మన్. చిత్రంలో ఎమ్మెల్యే రాపాక తదితరులు

మామిడికుదురు/మలికిపురం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి, ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని వైఎస్సార్ సీపీ ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ పీవీ మిథున్‌రెడ్డి సూచించారు. ఈ విషయాన్ని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు తెలిపారు. వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా కటకంశెట్టి ఆదిత్యను నియమించిన సందర్భంగా ఎమ్మెల్యే వరప్రసాదరావు, పార్టీ శ్రేణులు యానాంలో ఉన్న మిథున్‌రెడ్డిని సోమవారం కలిసి, కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను ఆదిత్య సత్కరించారు. 'జగనన్నే మా నమ్మకం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా మిథున్‌రెడ్డి ఈ సందర్భంగా సూచించారని ఎమ్మెల్యే చెప్పారు. పార్టీ శ్రేణులు కష్టపడి పని చేయాల్సిందిగా సూచించారన్నారు. మిథున్‌రెడ్డిని కలిసిన వారిలో పార్టీ నేతలు పలువురు ఉన్నారు.

హైవే అధికారులు న్యాయం చేయాలంటూ ధర్నా



అంతర్వేది రోడ్డు సెంటర్లో ఆందోళనకారులతో చర్చిస్తున్న తహసీల్దార్ రామకుమారి

సఖినేటిపల్లి: మండలంలోని వేర్వేరు గ్రామాల మీదుగా వెళుతున్న నేషనల్ హై వే 216 విషయంలో నష్టపోతున్న రైతులకు, ఇళ్ల యజమానులకు, వివిధ దుకాణాల యజమానులకు పూర్తి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం అంతర్వేది రోడ్డు సెంటర్‌లో గ్రామస్తులు, రైతులు ధర్నా చేశారు. హై వే వెళుతున్న టేకిశెట్టిపాలెం, అంతర్వేదిపాలెం, రామేశ్వరం, తదితర గ్రామాల్లో వివిధ కేటగిరిలకు చెందిన వారంతా తీవ్రంగా నష్టపోతున్నారని, అయితే అధికారులు ఇందుకు తగ్గట్టుగా తగిన పరిహారం అందించాలని ఆందోళన కారులు డిమాండ్ చేశారు. నేషనల్ హై వే విస్తరణలో హై వే అథారిటీ అధికారులు సరైన నిర్ణయాలు తీసుకోవడంలో చిత్తశుద్ధి కనబరచడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ, తమ భూముల్లో విస్తరణ పనులకు సర్వే చేస్తున్నప్పటికీ సదరు భూమి తమది కాదనే పరిస్థితి వారు తీసుకువస్తున్నారన్నారు. ఈ క్రమంలో తహసీల్దార్ వై.రామకుమారి ఆ ప్రాంతానికి వచ్చి ఆందోళనకారులతో చర్చలు జరిపారు. ఈ మేరకు వినతి పత్రాన్ని కూడా వారు ఆమెకు అందజేశారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లగలమని ఆమె హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు. ఎంపీపీ వీరా మల్లిబాబు మాట్లాడుతూ, తనది 18 సెంట్లు హైవే విస్తరణ పరిధిలోకి వచ్చిందన్నారు. ఇళ్ల మధ్య, పొలాల మీదుగా వెళుతున్న హైవేలో మండల వ్యాప్తంగా చూస్తే మొత్తం 99 గృహాలు, 75 దుకాణాలు, ఆయా మార్గంలో రైతులు భూములు పడుతున్నాయన్నారు. వీరందరికీ మంచి జరిగేలా హై వే అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు కుసుమ చంద్రశేఖర్, వీరా వెంకన్నబాబు, చింతా రత్నరాజు, అన్నంనీడి బాబ్జీ, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



పలివెలలో సత్తెమ్మతల్లిని దర్శించుకుంటున్న గంగాధరరావు, లక్ష్మీపతిరావు తదితరులు

కొత్తపేట: మండలంలోని పలివెల చెరువుల వద్ద వరాల సత్తెమ్మ తల్లి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆ మేరకు ఆలయ నిర్మాణకర్తలు గవర సాయిబాబా, శివనాగదుర్గారావు తదితరుల ఆధ్వర్యాన ఉదయం నుంచి అమ్మవారికి హోమాలు, ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అనేక మంది భక్తులు మొక్కులు తీర్చుకున్నారు, మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నసమారాధన చేశారు. ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, పలివెల, గంటి, దేవరపల్లి, ఈతకోట, కొత్తపేట పరిసర ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి



బెల్లంపూడిలో గృహ సారథులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి, వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు కృషి చేయాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సూచించారు. మండలంలోని బెల్లంపూడి, యర్రంశెట్టివారిపాలెం గ్రామాల్లో సోమవారం గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు మండలశాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావుల అధ్యక్షతన అవగాహన సదస్సులు నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో సీఎం జగన్ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. ఈనెల 18 నుంచి జరుగనున్న జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. గృహ సారథులకు, కన్వీనర్లకు చిట్టిబాబు కిట్లు పంపిణీ చేశారు. సమావేశంలో సర్పంచ్‌లు బండి మహాలక్ష్మి, తోలేటి బంగారునాయుడు, నూకపెయ్యి ప్రసన్నకుమార్, సొసైటీ చైర్మన్ యన్నాబత్తుల ఆనంద్, నాయకులు పితాని నర్సింహారావు, బండి రమేష్, రాంబాబు, అప్పన వెర్రిబాబు, గిడ్డి రాంబాబు, మేడిది రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

'సరిపెల్ల' సేవలు ఎనలేనివి



రంగరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆత్రేయపురం: వసంతవాడ ఎత్తిపోతల పథకం చైర్మన్, సీనియర్ వైఎస్సార్ సీపీ నేత సరిపెల్ల రంగరాజు మృతి పార్టీకి తీరని లోటని జిల్లా పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కప్పల శ్రీధర్, కొత్తపేట ఎంపీపీ మార్గని గంగాధరరావు, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, కొత్తపేట మండలం సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతి అన్నారు. సోమవారం ఆత్రేయపురం మండలం తాడిపూడిలో మండల పార్టీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో నియోజకవర్గ నాలుగు మండలాల నుంచి సరిపెల్ల రంగరాజు వర్ధంతి సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పాలా నాగేశ్వరరావు, గాదిరాజు రామకృష్ణంరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేఎస్ఎస్ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఆదిమూలం

పి.గన్నవరం: కోనసీమ జిల్లా కాపు సంక్షేమ సేన రైతు విభాగం అధ్యక్షుడిగా పి.గన్నవరం మండలం ఆదిమూలం వారి పాలేనికి చెందిన మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ఆదిమూలం సూర్యనారాయణ మూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు బసవా చినబాబు ఉత్తర్వులు జారీ చేశారు. సూర్యనారాయణ మూర్తిని కేఎస్ఎస్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో కాపు సంక్షేమ సేన నాయకులు తిక్కా శేషబాబు, పోలిశెట్టి బాబు, డీఎస్ఎన్ కుమార్, మేడిది శంకరం, కొమ్మూరి మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం

రావులపాలెం: అలివేలు మంగా పద్మావతి ఆండాళ్ సహిత వేంకటేశ్వరస్వామి 14వ వార్షిక నవాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు సోమవారం స్వామికి పుత్రకామేష్టి హోమం వైభవంగా నిర్వహించారు. తొలుతగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామికి ఉదయాన్నే సుప్రభాత సేవ, సహస్ర నామార్చన తదితర పూజలు నిర్వహించారు. అనంతం స్వామిని ఉత్సవ మూర్తులను రథంపై ఉంచి గోవిందమాలధారులు పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వాడపల్లి కమలనాథాచార్యుల ఆధ్వర్యంలో పలు పూజలు జరిపారు. రాత్రికి స్వామికి అశ్వవాహనోత్సవం కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఏర్పాట్లను దేవస్థాన పాలక మండలి చైర్మన్ పడాల పెదవెంకటరెడ్డి, తదితర సభ్యులు పర్యవేక్షించారు.

13 మందిని గాయపర్చిన కుక్కలు

అయినవిల్లి: మండలంలోని తొత్తరమూడి పరిసర ప్రాంతాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఆది, సోమవారాల్లో 13 మందిని కుక్కలు గాయపరిచాయి. వీరంతా అమలాపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందారు. ముక్తేశ్వరం అగ్రహారంలో రోడ్డులో ఓ మేకను పిచ్చి కుక్కలు తరుముకుంటూ వచ్చాయి. వాటి బారి నుంచి దారిని పోయే వ్యక్తి కాపాడాడు. కుక్కలు గుంపుగా వస్తే గ్రామంలో భయకంపితులవుతున్నారు. కుక్కల బారి నుంచి తమను రక్షించాలని అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు.

ఇజ్రాయిల్‌ను సత్కరించిన ఎమ్మెల్యే



ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: కోనసీమ జిల్లా ఎమ్మెల్సీగా ఎన్నికైన బొమ్మి ఇజ్రాయిల్ సోమవారం రాత్రి స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయానికి విచ్చేశారు. ఆయనను స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి దుశ్శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధరరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, మాజీ జెడ్పీటీసీ సాకా ప్రసన్నకుమార్, శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బొక్కా వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.